క్లుప్తంగా

ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం

బిక్కవోలు: స్థానిక మండలం పరిషత్ కార్యాలయం వద్ద ఉల్లాస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఎంపీపీ తేతలి సుమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలోని ఉల్లాస్ (అక్షర ఆంధ్ర) ఒక రోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలోని వీవోఏలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్ ఏ వెంకటరెడ్డి మాట్లాడుతూ వయోజన విద్య వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలోని ఎంపీడీవో శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


మల్లిపూడిలో పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

రంగంపేట: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని గ్రామ సర్పంచ్ వేము మాధవి చిరంజీవి అన్నారు. మల్లిపూడి గ్రామంలో చేపట్టిన ఇంటింటా చెత్త సేకరణ, చెత్త శుభ్రం చేసే విధానాన్ని పరిశీలించారు. కాలువలు రోడ్లపై చెత్త వేయడం వల్ల అపరిశుభ్రత నెలకొని రోగాలు వ్యాప్తి, చెందే అవకాశం ఉందన్నారు. పంచాయతీ వాహనాల్లో చెత్త వేసి, సిబ్బందికి సహకరించాలన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


నిందితుడిని అదుపులోకి తీసుకుంటున్న సిబ్బంది

రంగంపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మల్లిపూడి గ్రామంలో బుధవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ దాడుల్లో మల్లిపూడి గ్రామానికి చెందిన జీలం దుర్గయ్యను అరెస్టు చేసి, అతని నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఆమె చెప్పారు.

కంప్యూటర్లు ప్రారంభం


బిక్కవోలులో కంప్యూటర్లు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుమ

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం కంప్యూటర్లు ప్రింటర్లు ప్రారంభించారు. బుధవారం మండల పరిషత్ నిధులు రూ.1.86 లక్షలతో కంప్యూటర్లు, ప్రింటర్లు కొనుగోలు, మీటింగ్ హాలు కుర్చీలను కొనుగోలు చేశారు. వాటిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీపీ తేతలి సుమ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోని తొస్సిపూడి మాజీ ఉపసర్పంచి తేతలి సూర్యచంద్రారెడ్డి, ఎంపీటీసీలు బండారుశివ, బిక్కవోలు సర్పంచి సరెళ్ల సుమలత, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్, టీబీ వ్యాధులపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ చేస్తున్న సిబ్బంది

రాజానగరం: జిల్లా, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థల సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో దివాన్‌చెరువులో బుధవారం ఎయిడ్స్, టీబీ, సుఖ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయంలో సమావేశంలో ఈ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగించారు. వారు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్య, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదుతోనే బీమా నష్టపరిహారం

కోరుకొండ: ప్రతి రైతు పంట నమోదు చేసుకోవడం ద్వారా పంట నష్టపరిహారం, బీమాను పొందగలరని ఉద్యానశాఖ కోరుకొండ మండలాధికారి రినీ తెలిపారు. సోమవారం ఆమె విలేకరలతో మాట్లాడుతూ రైతులు రాయితీని పొందాలంటే ఈ-పంటలో నమోదై ఉండాలన్నారు. కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు ఆమె అవగాహన కల్పించారు. మండలంలో 8,787 ఎకరాల ఉద్యన పంటలకు ఇప్పటివరకూ 3,500 ఎకరాలకు మాత్రమే ఈ-క్రాప్ పూర్తయ్యిందన్నారు. మిగిలిన ఈ జీడిమామిడి, మామిడి, రైతులు రైతు సేవాయ కేంద్రాల ద్వారా నెల 30వ తేదీ లోపుగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

- సచివాలయాలు నిర్వీర్యం
- సేవలను పరిమితం చేసిన కూటమి ప్రభుత్వం
- ప్రజల అవస్థలు



ఊలపల్లి సచివాలయ భవనం

బిక్కవోలు: అర్హులందరికీ ప్రతి ప్రభుత్వ పథకాన్ని అందించాలని, వారి ఇంటి ముగింటకే వాటిని చేర్చాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేసింది. దీని కోసం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో జనాభాకు అనుగుణంగా వీటిని ఏర్పాటు చేసి, వాటిలో ఉద్యోగులను నియమించారు. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లనవసరం లేకుండా అన్ని పనులు గ్రామస్థాయిలో జరిగేలా చర్యలు తీసుకున్నారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. వాటి నుంచి నామమాత్రంగా సేవలు అందుతుండడంతో నేడు వెలవెలబోతున్నాయి.

అరకొర సేవలు

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులను, వలంటీర్లను ఏర్పాటు చేసి ప్రజలకు భరోసాగా, అండగా నిలిచింది. కానీ నేటి కూటమి ప్రభుత్వం వాటికి తూట్లు పొడుస్తోంది. కూటమి అధికారంలో వచ్చిన వెంటనే వలంటీర్ల వ్యవస్థను, ప్రభుత్వం మద్యం దుకాణంలో పని చేస్తున్న ఉద్యోగులు, ఇంటింటికీ రేషన్ అందించే ఉద్యోగులను తొలగించింది. సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేస్తోంది. వాటి ద్వారా నాడు ప్రజలకు సుమారు 545 సేవలు అందేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. కుల, ఆదాయం, వన్‌బీ తదితర సాధారణ సేవలు మాత్రమే అందిస్తోంది. రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్య శ్రీ కార్డుల జారీ లేదు. పింఛన్ లబ్ధిదారుడు చనిపోతే ఆయన భాగస్వామికి స్పౌంజ్ పింఛన్ ఇవ్వడం, రేషన్ స్మార్ట్ కార్డులు ఇవ్వడం తప్ప ఇంకా కొత్తగా చేసింది ఏమీ లేదు.

కళావిహీనం

సచివాలయాల్లో సేవలు అందక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెండు వేల జనాభా ఉన్న గ్రామాల్లో సుమారు రూ.45 లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించారు. నిన్నటి వరకు వివిధ సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు, లబ్ధిదారులు, దరఖాస్తుదారుల రాకపోకలతో కళకళ లాడిన కార్యాలయాలు నేడు వెల వెల పోతున్నాయి. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో 79 సచివాలయాలుండగా, వాటిలో 500 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు.

> **సేవలు అందించాలి**
>
> 
>
> సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందించాలి. గతంలో మాదిరిగానే ప్రజలకు ఉపయోగకరంగా మార్చాలి. గ్రామాల్లో ప్రజలకు అవస్థలు లేకుండా చూడాలి.
>
> – పోతుల ప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచ్, ఊలపల్లి

నాడు విమర్శలు చేసి..

టీడీపీ నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగులపై అనేక విమర్శలు చేసేవారు. కానీ నేడు అధికారంలోకి వచ్చాక పింఛన్ల పంపిణీకి సచివాలయం ఉద్యోగులే అవసరమయ్యారు. అంతేగాక ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో స్టిక్కర్లు అతికించడం దగ్గర నుంచి ఇంటింటి ప్రచారం వరకు వీరినే ఉపయోగించి వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారు.

పౌష్టికాహారంపై అవగాహన

రాజానగరం: అభివృద్ధి చెందుతున్న నాగరికతలో ఆహారంపై సరైన శ్రద్ధ తీసుకోలేకపోతున్నామని, ఆ నిర్లక్ష్యమే అనారోగ్యాలకు ప్రధాన కారణమవుతుందని డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నేషనల్ న్యూట్రిషన్ వీక్‌లో భాగంగా దివాన్‌చెరువులోని విజయభారతి చెస్ట్ ఆస్పత్రిలో బుధవారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రకాల ఆహార పదార్థాల తయారీలో ప్రతిభ కనబరిచిన సూర్యకుమారి, కీర్తి, కుమారి, వీరలక్ష్మి, ఖతిజా బేగంలకు గూడూరి శ్రీనివాస్ నగదు బహుమతులను అందజేశారు. పాల్గొన్నవారికి కూడా గూడూరి రాధిక బహుమతులు అందించారు. కార్యక్రమంలో సూపరింటిండెంట్ డాక్టర్ రాజశేఖర్, సౌజన్య శ్రీవాణి, మేనేజర్స్ పెండ్యాల కోదండరామయ్య, అయ్యప్ప మణికంఠధర్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటాడుతున్న ఎనిమిది మంది అరెస్టు

సీతానగరం: మునికూడలి శివారు పేకాటాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. మునికూడలి శివారున పేకాటాడుతుండగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ 11,360 స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఎనిమిది మంది మునికూడలికి చెందిన ముగ్గురు, వెదుళ్లపల్లికి చెందిన ఇద్దరు, రాజంపేటకు చెందిన ముగ్గురని తెలిపారు. కేసు నమోదు చేశామని కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై రామ్ కుమార్ తెలిపారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ వీరయ్యగౌడ్

రాజానగరం: క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ, ఎంచుకున్న లక్ష్యాలను సాధించే దిశగా పయనించాలని స్థానిక సీఐ వీరయ్యగౌడ్ విద్యార్థులకు సూచించారు. అంతేగానీ తోటి విద్యార్థులను అల్లరి పెట్టి ఆనందించాలనుకుని ర్యాగింగ్‌కి పాల్పడితే భవిష్యత్ నాశనమవుతుందని హెచ్చరించారు. స్థానిక గోదవరి గ్లోబల్ యూనివర్సిటీ (జిజియు)లో యాంటీ ర్యాగింగ్, డ్రగ్ అబ్యూస్ అనే అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. చదువు విలువను తెలుసుకుని, కన్నవారి ఆశలకు అనుగుణంగా ఎదగాలన్నారు. జీవితంలో విద్యార్థి దశ ఎంతో ఉన్నతమైందని, దానిని సద్వినియోగం చేసుకుంటే జీవితం కూడా ఉన్నతంగానే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వీసీ డాక్టర్ కేవీవీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ఎస్సై అలెగ్జాండర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పీఓ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనతోనే ప్రయోజనం


రైతులకు ఎలుకల మందు కలిపిన నూకలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

పెదపూడి: ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపడితేనే ప్రయోజనం ఉంటుందని మండల వ్యవసాయాధికారి సత్యప్రసాద్ అన్నారు. బుధవారం పెద్దాడ గ్రామంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఏడీఏ దుర్గాలక్ష్మి పంట పొలాలలో ఎలుకల వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు ఎలుకలు మందు, నూనె, నూకలు కలిపిన ఎలుకల మందు మిశ్రమాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దాడ గ్రామ వ్యవసాయ సహాయకులు కె.శివజ్యోతి, పి.భ్రమరాంబ, సచివాలయం సిబ్బంది, ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ


కాపవరంలో తనిఖీ చేస్తున్న అధికారులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం, కాపవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. బలభద్రపురం గ్రామంలో సొసైటీ, కాపవరంలో శ్రీనివాసా ఏజెన్సీస్, శ్రీవెంకట రామా ఏజెన్సీస్ దుకాణాల్లో ఎరువులు, పురుగుమందుల స్టాకును పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.మధుబాబు మాట్లాడుతూ బిక్కవోలు మండలంలో సుమారుగా 55 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఎమ్మార్పీ మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలన్నారు.ఈ తనిఖీలో అసిస్టెంట్ జియాలజిస్ట్ ఎస్.లక్ష్మీ నారాయణ, రంగంపేట వ్యవసాయ శాఖ ఎవో శ్రీనివాస్, ఏఈవోలు కొవ్వూరి మల్లికార్జున భాస్కర్‌రెడ్డి, కోనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వస్తువుల వితరణ


ఎలక్ట్రానిక్ వస్తువులను కళాశాల ప్రిన్సిపాల్ రాజుకు అందిస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

అనపర్తి : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అనపర్తి శివారు కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియర్ జూనియర్ కళాశాల విద్యార్థుల సౌకర్యం కోసం ఎలక్ట్రానిక్ వస్తువులను వితరణ చేసింది. బుధవారం అమరావతి సర్కిల్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ ఏడో అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనియన్ జనరల్ సెక్రటరీ ఎల్.చంద్రశేఖర్ ఆదేశాల మేరకు పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్టు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తూరు కళాశాలకు ఇన్వెర్టర్లు, సీలింగ్ ఫ్యాన్లను యూనియన్ సభ్యులు అందజేశారు. లైబ్రరీకి జేఈఈటీ, ఎన్ఈఈటీ బుక్స్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో డీజీఎస్ పాపారావు, వైస్ ప్రెసిడెంట్ పేరి శాస్త్రి, ఏజీఎస్ చంద్రశేఖర్, ఆర్ఎస్ అప్పారావు, కె.రాజశేఖర్, మణికంఠ, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రామాంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించాలి


ఏఓ గౌరీదేవికి వినతిపత్రం అందిస్తున్న రామకృష్ణంరాజు తదితరులు

సీతానగరం: మండల గ్రామాల్లోని రైతులకు యూరియా పుష్కలంగా అందించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గం అధ్యక్షులు ముదునూరి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో రైతులు ఏఓ గౌరీదేవికి వినతిపత్రం అందించారు. బుధవారం సీతానగరం వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓ గౌరీదేవిని కలిసి పార్టీ రైతు విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు రామకృష్ణం రాజు ఆధ్వర్యంలో పార్టీ ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం నియోజకవర్గం చైర్మన్ పోలినాటి ఈశ్వరుడు, రైతులు లక్కిశెట్టి కృష్ణ, పచ్చమట్ల మణిరాజు, ఇందుకూరి రవి, ముదునూరి సుబ్రహ్మణ్యం తదితరులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రైతులకు ఒక బస్తా కాకుండా ఎంత అవసరమో తెలుసుకుని అందించాలని కోరారు. ప్రైవేట్ వ్యాపారులు వద్ద యూరియా కొనుగోలు చేయాలంటే యూరియా బస్తాతోపాటు కాంప్లెక్స్ ఎరువులు, గుళికలు తీసుకోవాలని నిబంధన పెడుతున్నారని, దీంతో రైతులపై అధిక బారం పడుతుందన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సకాలంలో ఎరువులు వేయకపోతే పంట దిగుబడి ఘననీయంగా తగ్గుతుందని, సమయానికి ఎరువుల వేయాలన్నారు. ఇటువంటి ఇబ్బంది రైతులకు గతంలో ఎప్పుడు కలగలేదని వివరించారు. ఇప్పటికైనా యూరియాను పుష్కలంగా రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ముదునూరి ప్రసాదరాజు, కోసూరి నాగరాజు, బైర్రాజు చంద్రరాజు తదితరులు పాల్గొన్నారు

మూలనపడిన శ్రీసత్యసాయి వాటర్ ప్రాజెక్టు

- ఆలం లేక నిలిచిన నీటిశుద్ధి
- పాడైన ఫిల్టర్ యూనిట్
- తరచూ మోటార్ల మరమ్మతులు


పురుషోత్తపట్నంలోని శ్రీసత్యసాయి మంచినీటి పథకం

సీతానగరం: ఏజెన్సీ ప్రాంత ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో భగవాన్ శ్రీసత్యసాయి బాబా తన ట్రస్ట్ ద్వారా పురుషోత్తపట్నంలో శ్రీసత్యసాయి మంచినీటి పథకం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పురుషోత్తపట్నం హెడ్ వర్క్ నుంచి శుద్ధి చేసిన గోదావరి జలాలను లక్షలాది ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అధికారులు దీనిని నిర్లక్ష్యం చేయడంతో ప్రాజెక్టు మూలపడింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. ఆలంను కొనుగోలు చేయడం నిలిపివేశాడు. కొత్త కాంట్రాక్టర్ వచ్చే వరకూ పాత కాంట్రాక్టర్ బాధ్యత తీసుకోవాలని అయితే ఈ నిబంధనను తుంగలో తొక్కి హాలం కొనుగోలు చేయడం మానివేశారు. దీనితో పురుషోత్తపట్నంలోని హెడ్ వర్క్ నుంచి శుద్ధి జలాలు నిలిచిపోయాయి. ప్రాజెక్టు కార్మికులు జూలై 7వ తేదీ నుంచి తమకు జీతాలు అందించడం లేదని సమ్మెలకు దిగారు. 50 శాతం అందిస్తామని, మిగిలిన జీతాల నగదు నెల రోజుల్లో పూర్తిగా అందిస్తామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హామీతో గత నెల 10 నుంచి విధులకు వచ్చి తాగునీటిని అందించారు. గోదావరి నీటిలోని మట్టిని తొలగించాలంటే హాలం ప్రాజెక్టులో వేస్తారు. అయితే గోదావరి వరద సమయంలో టన్ను హాలం నాలుగు రోజులు వస్తుంది. మామూళ్ల రోజుల్లో టన్ను హాలం 20 రోజులు పైబడి వస్తుంది. ప్రస్తుతం హాలం లేకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో గత వారం రోజుల నుంచి శ్రీసత్యసాయి వాటర్ ప్రాజెక్టు నుంచి చుక్కనీరు బయటకు రాలేదు. ఇదే కాకుండా తరచూ మోటార్లు మరమ్మతులకు గురవుతోంది. వీటిని పట్టించుకున్న నాథులే లేరు. అలాగే ఫిల్టర్ యూనిట్ కూడా పాడైపోయింది. పురుషోత్తపట్నంలోకి హెడ్ వర్క్ నుంచి శుద్ధి చేసిన జలాలు ఇందుకూరిపేట, కోరుకొండ మెయిన్‌లకు వెళతాయి. వాటి నుంచి ఎం.రావలంక, ఇందుకూరు, కొత్తపల్లి, ఆర్.యర్రంపాలెం, నరసాపురం సబ్‌లకు తాగునీరు వెళుతుంది. దీనితో తొంబై గ్రామాల్లోని మూడు లక్షల మందికి తాగునీరు నిలిచిపోయింది. జీతాలు కార్మికులు ఇవ్వకపోతే వారు త్వరలో సమ్మెబాటపడతామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సైబర్ నేరాల గురించి వివరిస్తున్న సైబర్ ల్యాబ్ పోలీసులు

రాజానగరం: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగపరుస్తూ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలిని రాజమహేంద్రవరంలోని సైబర్ ల్యాబ్ పోలీసులు వైవీ సురేష్, అబ్దుల్ షౌకత్‌లు విద్యార్థులకు సూచించారు. మండలంలోని కానవరం, ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన కలిగిస్తూ బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్ గేమ్‌లతో కొంతమంది విద్యార్థులను సైబర్ నేరగాళ్లు మాయచేసి, సులువుగా సొమ్ములు లాక్కుంటున్నారన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ సొమ్ములు పొందవచ్చనే దురాశకు పోయేవారే ఇటువంటి నేరగాళ్లకు చిక్కుతారన్నారు. అత్యాశకు పోకుండా ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అడుగులు వేయాలని హితవు పలికారు. ముఖ్యంగా ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాంలలో అపరిచితులతో చాటింగ్‌లు చేయవద్దన్నారు. తెలియని లింకులు, మెయిల్స్ ఓపెన్ చేయకూడదన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

రహదారి పనులపై కొరవడిన పర్యవేక్షణ


రహదారి పనులలో నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి

రాజానగరం: రహదారుల నిర్వహణ ప్రైవేట్ సంస్థలు చూసుకుంటుంటే వాటిపై మీ పర్యవేక్షణ ఏమైందని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి జనార్దన రెడ్డి జాతీయ రహదారి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం నుంచి విజయవాడకు రోడ్డు మార్గాన పయనమైన ఆయన మధ్యలో రహదారి మెయింటెన్స్ పనుల పర్యవేక్షణను పరిశీలించారు. అన్నవరం నుంచి దివాన్‌చెరువు వరకు 70 కిలోమీటర్ల రహదారి మెయింటెన్స్ పనులను ముంబైకి చెందిన ఒక ప్రైవేట్ సంస్థ చేపడుతోంది. రహదారి అభివృద్ధి పనుల్లో వాడుతున్న మెటీరియల్ నాణ్యతను తనిఖీ చేశారు. ఈ క్రమంలో క్షేత్ర స్థాయిలో ఆయా పనులపై జాతీయ రహదారి అధికారుల పర్యవేక్షణ కొరవడాన్ని మంత్రి తీవ్రంగా పరిగణిస్తూ, అటువంటి అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ ఉన్నతాధికారులను మంత్రి ఫోన్‌లో ఆదేశించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


దొంతమూరు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ధర్మ ప్రచారక్ రఘు

రంగంపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేసి, హిందూ ఆలయాలలో దళిత భక్తులకు ప్రవేశం కల్పించి విజయం సాధించిన సంస్థ సమరసత సేవా ఫౌండేషన్ మాత్రమేనని జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు అన్నారు. బుధవారం మండల పరిధిలోని జి.దొంతమూరులో జరిగిన మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆలయానికి దూరమైన సామాజిక వర్గం నుంచి గర్భ గుడిలో పూజారులుగా శిక్షణ ఇచ్చి తయారు చేసిన సంస్థ సమరసత సేవా ఫౌండేషన్ అని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవించిన కాలంలో తన సామాజిక వర్గం దైవ దర్శనానికి దూరంగా ఉండాల్సి వస్తుందని ఆవేదన చెందేవారని, ఎప్పటికైనా సమాజంలో మార్పు రావాలని ఆయన ఆశించారన్నారు. ఆ మార్పు సమరసత సేవా ఫౌండేషన్ ద్వారా జరిగిందని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిధుల ద్వారా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన దేవాలయాలలో ఎస్సీ ఎస్టీ, మత్స్యకార యువకులు అర్చక స్వాములుగా గర్భ గుడిలో పూజలు నిర్వహిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న 57 దేవాలయాలలో ఈ పూజారులు ఆధ్యాత్మిక చింతనతో నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సాంస్కృతిక సహ ప్రముఖ శింగన సత్యనారాయణ, మండల కన్వీనర్ సోడసాని ప్రసాద్, అర్చక స్వామి గోపి, నల్లా మణికంఠ, దేవినీడి లక్ష్మి, మేడిశెట్టి పార్వతి, పిన్నమరెడ్డి నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యకు శాశ్వత పరిష్కారం

రాజమహేంద్రవరం రూరల్: దీర్ఘకాలంలో ఉన్న భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తామని, విభేదాలు లేకుండా అందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజమహేంద్రవరం ఆర్‌డీవో కృష్ణ నాయక్ అన్నారు. పిడింగొయ్యిలోని సర్వే నంబర్ 511 ప్రభుత్వ భూమిలోని శివాలయం, అంబేడ్కర్ విగ్రహం ఉన్న ప్రాంతాన్ని బుధవారం వారు పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించడంతో ఈ సమస్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. కొంత స్థలాన్ని శివాలయం నిర్మాణానికి, మరి కొంత స్థలాన్ని అంబేడ్కర్ విగ్రహం, కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు కేటాయించి, మిగిలిన భూమిని పంచాయతీ పరిధిలో ఇళ్లు లేని వారికి ఇస్తామన్నారు. సదరు విషయాన్ని ఇరువర్గాలూ ఆలోచించి తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

అక్షరాస్యతలో ఏపీకి 29 స్థానం


సీతానగరం స్త్రీశక్తి భవనంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో అధికారులు

సీతానగరం: దేశంలో ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యతలో 29వ స్థానంలో ఉందని ఏపీఎం జిలాని అన్నారు. బుధవారం సీతానగరం స్త్రీశక్తి భవనంలో అక్షరాంధ్ర ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో ఏపీఎం మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంచేందుకు ఉల్లాస్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డ్వాక్రా సంఘాల్లో మహిళలు ఎక్కువగా నిరక్షరాస్యులుగా ఉన్నారని, పిల్లలకు విద్యపై సరైన అవగాహన కల్పించలేకపోవడం వలన వారి భవిష్యత్తును తీర్చిదిద్దాడంలో అనేక ఇబ్బందులకు గురైవుతున్నారన్నారు. నిరక్షరాస్యుల సభ్యులను గుర్తించి ఉల్లాస్ ద్వారా చదువు నేర్పించేందుకు పది మంది నిరక్ష్యరాస్యులకు ఒక స్వచ్ఛంద వలంటీర్ నియమించడం ద్వారా చదువు నేర్పించడం జరుగుతుందన్నారు. మండలంలో 2,500 మంది నిరక్షరాస్యులను గుర్తిస్తున్నారని, వారిని 250 మంది వలంటీర్లను గుర్తించి విద్యను నేర్పిస్తామని ఆయన తెలిపారు. ఎంపీడీఓ ఎం భారతి అక్షరాంధ్ర సంపూర్ణ అక్షరాస్యత ప్రతిజ్ఞ చేయించారు. నిరక్షరాసుల వలన కలిగే నష్టాలు, ఇబ్బందులు గురించి ఎంఈఓ కె.స్వామినాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఏపీఓ సత్యవాణి, సీసీలు హరిబాబు, వెంకట లక్ష్మి, ధారా లక్ష్మి, సంఘం సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని మార్కెట్ సెంటర్ వద్ద గణపతి హోమం నిర్వహించారు. బుధవారం బ్రహ్మశ్రీ రమణ శర్మ ఆధ్వర్యంలో పండిత బృందం శాస్త్రోక్తంగా క్రతువులను నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులతో లక్ష్మీ గణపతి హోమం, లక్ష గరిక పూజ చేశారు. అనంతరం అన్న సమారధన చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నం వీర భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలికి ఆశ్రయం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామంలో మతి స్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వృద్ధురాలిని సామాజిక కార్యకర్త, వైఎస్సార్ సీపీ నాయకురాలు షేక్ సమీరాబేగం బుధవారం రూత్ ఓల్డేజ్ హోంలో చేర్పించారు. ఆ వృద్ధురాలు నాలుగు రోజులుగా గ్రామంలో తిరుగుతోందని, మానసిక పరిస్థితి సరిగ్గా లేక ఏమీ చెప్పలేకపోతుందన్నారు. దీంతో మంగళవారం రాత్రి ఆమెను తన ఇంటిలో ఉంచి, రూత్ ఓల్డేజ్‌హోంలో చేర్పించడం జరిగిందన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు బొమ్మూరు మురళీకొండపై ఉన్న రూత్ ఓల్డేజ్ హోంలో సంప్రదించాలన్నారు.